పాల ఉత్పత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న బోడి అశోక్‌కుమార్‌యాదవ్

గోల్కొండ: పాడి రైతులు రోజురోజుకూ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం కార్వాన్ శ్రీ కృష్ణ భవన్‌లో కార్వాన్ యాదవ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులను, పాడి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ఇతర పరిశ్రమలకు ప్రభుత్వం అడగకుండానే ఆర్థిక సహాయంతో పాటు సబ్సిడీలు కూడా అందిస్తుందన్నారు. అయితే నగరంలోని పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదని ఆయన అన్నారు. యాదవ సోదరుల వద్ద కనీసం 4-5 గేదెలు ఉంటే అటువంటి వారి ఇళ్లపై కమర్షియల్ పేరుతో ఇంటి పన్ను వసూలు చేయడం సబబా అని ఆయన ప్రశ్నించారు. పశువుల వైద్యం కోసం వేలాది రూపాయలు పేద పాడి రైతు వెచ్చిస్తున్నాడని ప్రభుత్వం పరంగా వెటర్నరీ ఆసుపత్రుల నుంచి పాడి గేదెలకు ఎటువంటి వైద్యం అందడం లేదన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తూ, ఇంటి పన్ను మాఫీ చేయాలని, యంత్రాలు కొనేందుకు సబ్సిడీ అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్వాన్ యాదవ సంఘం ప్రధాన కార్యదర్శులు బోని అన్నుయాదవ్, జీ.సందేశ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, ఉమాకాంత్‌యాదవ్, నాగేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఎంపికపై రగడ

- హైదరాబాద్ వర్సెస్ రంగారెడ్డి జిల్లా నాయకులు పోటాపోటీ
- హైదరాబాద్‌కే ఇవ్వాలని నిబంధనలు ఉన్నా తుంగలో తొక్కాలని చూస్తున్న రంగారెడ్డి
- చిరునామాల కోసం ఆధార్‌కార్డులు మారుస్తున్న రంగారెడ్డి నాయకులు
- గుడిమల్కాపూర్ మార్కెట్ కేంద్రంగా రచ్చ



అబిడ్స్/గోల్కొండ: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ నియామకం రచ్చరచ్చగా మారింది. హైదరాబాద్‌లోని ఏడు రెవెన్యూ మండలాల పరిధుల వారికే ఇవ్వాలని నిబంధనలు ఉండడంతో రంగారెడ్డి జిల్లా నాయకులు హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో రెండు జిల్లాల నాయకుల మధ్య హోర్డ్ వార్ కొనసాగుతోంది. రెండు రోజుల క్రితమే పలు జిల్లాల మార్కెట్ కమిటీలను ప్రకటించిన రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీని ప్రకటించలేకపోయారు. కొన్ని నెలలుగా ఈ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పోస్టులన్నీ హైదరాబాద్ జిల్లావారికే ఇవ్వాలని నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. కొంత మంది ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో వచ్చిన రంగారెడ్డి జిల్లా బడా నాయకులు తమకే కావాలని పట్టుపడడంతో ఈ మార్కెట్ కమిటీ నియామకం తీవ్ర వివాదంగా మారింది.

చిరునామాలు మారుస్తూ..

కొంత మంది రంగారెడ్డి జిల్లా నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్, ఇతర పదవుల కోసం రంగారెడ్డి జిల్లా ఆధార్‌కార్డు అడ్రస్‌ల మీద దరఖాస్తులు చేసుకున్నారు. హైదరాబాద్ జిల్లా నాయకులంతా దీనిని వ్యతిరేకించి ఏకంగా ముఖ్యమంత్రి, మార్కెటింగ్ మంత్రి, మార్కెటింగ్ డైరెక్టర్లకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నాయకులకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఇవ్వాలని నిబంధనలు ఉంటే రంగారెడ్డి జిల్లా వాసులకే ఎలా ఇస్తారని పలువురు ప్రశ్నించడంతో రంగారెడ్డి నాయకులకు దిమ్మ తిరిగిపోయింది. పలువురు నాయకులు తమ ఆధార్‌కార్డుల చిరునామాలు మార్చేందుకు హైదరాబాద్‌లోని పలువురు బంధువులు, మిత్రుల ఇళ్ల వద్దకు చక్కర్లు కొడుతున్నారు. మీ ఇంటిపై మా ఆధార్‌కార్డు మారుస్తున్నామని వేడుకుంటున్నారు. సీఐడీ, ఇతర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు చేసి విచారణ చేపట్టేందుకు డిమాండ్ చేస్తామని కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నాయకులు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులకు ఎలా ఇస్తారు?

రంగారెడ్డి జిల్లాలో కొంతమంది ప్రజాప్రతినిధుల వెంట ఎన్నో సంవత్సరాలు బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరితే వారికి పదవులు ఎలా ఇస్తారని 30 ఏళ్లకు పైగా గాంధీభవన్‌ను అంటి పెట్టుకొని ఉంటున్న నిజమైన క్రమశిక్షణగల కార్యకర్తలు, నాయకులు ఎక్కడ పోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు పార్టీ పదవులు ఇస్తే తాము రోడ్లపై తిరగాలని పలువురు పేర్కొంటున్నారు. ఏఐసీసీ నిబంధనల ప్రకారం..బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులకు ఎవరికీ ప్రభుత్వ పదవులు ఇవ్వొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎలా పదవులు ఇస్తారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ వారికే పదవులు ఇస్తే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసేందుకు పెద్ద ఎత్తున సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నారు.

పెద్ద ఎత్తున ఆందోళనలు, ఫిర్యాదులు..

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీని నిబంధనలకు విరుద్ధంగా రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు ఇస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హైదరాబాద్ జిల్లాకు చెందిన నాయకులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ఢిల్లీలోని ఏఐసీసీ అగ్ర నాయకులకు, రాహుల్‌గాంధీకి, మల్లికార్జున్ ఖార్గేకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని పలువురు పేర్కొంటున్నారు. గత పదేళ్లపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆందోళనలు, ధర్నాలు చేసిన నాయకులను కాదని బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు ఇస్తే తమ భవిష్యత్ ఏందని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి


హకీంపేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ డివిజన్ పరిధిలోని టోలిచౌకీ, హకీంపేట్, ఎస్ఎస్ఎఫ్ కాలనీ, కాలా బంగ్లా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బుల్కాపూర్ నాలాను పరిశీలించారు. నాలాలో పూడికతీత పనులు వెంటనే చేపట్టనున్నామని అన్నారు. గత వారం కురిసిన వర్షాలకు బుల్కాపూర్ నాలా పూర్తిగా నిండిందని నాలాలో పూడికలు నిండడం వల్ల నీరు ముందుకు కదలడం లేదన్నారు. అయితే పూడికతీత కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పనులు చేయిస్తున్నామన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ నసీరుద్దీన్, బల్దియా ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

జియాగూడ: ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఆకర్షితులై బీజేపీ సభ్యత్వ నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. శనివారం పురానాపూల్ వద్ద బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు, మెదక్ ఇన్‌చార్జి మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా ఇన్‌చార్జి గీతామూర్తి, గోల్కొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మంగళ్‌హాట్ కార్పొరేటర్, సీనియర్ నాయకులు లక్ష్మణ్‌సింగ్ జమేదార్, గోవింద్‌రాటి, నరహరి, రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి అలేఖ్య, లక్ష్మి, శ్యామ్‌రావు, కృష్ణ, ప్రమోద్ పాల్గొన్నారు.


సభ్యత నమోదులో రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, మోహన్‌గౌడ్

గంగపుత్ర సొసైటీ చెరువులను పరిరక్షించాలి


వినతిపత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు

గోల్కొండ: కార్వాన్ సబ్జి మండలి ప్రాథమిక మత్స్య సహకార సంఘానికి రాజేంద్రనగర్ పరిధిలో చెరువులు, కుంటలతో పాటు ఉస్మాన్‌సాగర్ దిగువ ప్రాంతాన నుంచి పురానాపూల్ వరకు చేపలు పట్టేందుకు అన్ని రకాల హక్కులు ఉన్నాయని ఈ చెరువులు, కుంటలను పరిరక్షించాలని సబ్జిమండీ మత్స్య సహకార సంఘం వారు కోరారు. శనివారం తెలంగాణ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం హైడ్రా కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాజేంద్రనగర్ పరిధిలోని చెరువులు, కుంటలు ప్రెస్టేజ్ గ్రూప్ సంస్థ వారు కబ్జా చేశారని గంగపుత్ర సోదరులకు వాటిలో చేపలు పట్టడానికి అనుమతించడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రాథమిక సంఘం అధ్యక్షుడు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి మురారీ రాంబాబు తదితరులున్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

జియాగూడ: మైత్రి శాంతి సంఘాల సహకారంతో శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నామని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ అన్నారు. శనివారం మైత్రి, శాంతి సంఘాలు, దుర్గానగర్, బస్తీ వాసులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్‌ను కలిసి ఘనంగా సన్మానించి గణపతి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కావూరి వెంకటేష్, సంఘసేవకుడు సంతోష్, బీఆర్‌ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, మైత్రి కమిటీ సభ్యులు నర్మద, జడల మోహన్, దేవేందర్, శంకర్, అత్తాపూర్ రాజేష్, అనిత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌స్పెక్టర్ సునీల్‌ను సన్మానిస్తున్న కావూరి వెంకటేష్, సంతోష్, కిశోర్‌కుమార్

విద్యాసంస్థలది కీలక బాధ్యత

బంజారాహిల్స్: చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యాసంస్థలదే కీలక బాధ్యత అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అంతర్జాతీయ బ్రాండ్‌గా పేరొందిన సఫారీ కిడ్ ప్రీ స్కూల్ అండ్ డేకేర్‌ను బంజారాహిల్స్‌లో శనివారం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ చిన్నారులకు చిన్ననాటి నుంచే మంచి మార్గాలను బోధించాలని సూచించారు. సఫారీ కిడ్ ఇండియా చైర్మన్ జితేంద్ర కర్సన్ చిన్నారులకు మెరుగైన విద్యను అందించే క్రమంలో సురక్షిత మార్గాలను పాటించడం జరుగుతుందన్నారు.

వరద బాధితులకు చేయూత



గౌలిపురా: వరద బాధితుల సహాయార్థం గౌలిపురా అయోధ్యనగర్‌లోని జ్ఞాన భారతి పాఠశాలకు చెందిన నర్సరీ నుంచి పదో తరగతి విద్యార్థులు సేకరించిన నోట్ బుక్‌లు, పెన్నులు, రబ్బర్లు, పుస్తకాలు, ఇతర వస్తువులను శనివారం సైన్స్ అధికారి ధర్మేందర్ ద్వారా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భీమిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ కోట జగదాంబిక మహంకాళీ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం కోటపై గల అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుండీ లెక్కింపులో అమ్మవారికి రూ.47,050 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పి.శివశంకర్, బి.సాయిబాబాచారి, సర్వేష్, రాములు తదితరులున్నారు.

యాదవులు లేని మంత్రివర్గం బాధాకరం

పంజగుట్ట: ఇప్పటి వరకు యాదవులు లేని మంత్రివర్గం లేదని మొదటిసారి యాదవులు లేకుండా మంత్రివర్గం కొనసాగడం బాధాకరమని రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షులు ఎల్లావుల చక్రధర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాదవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ యాదవులకు కేవలం 2 సీట్లు మాత్రమే ఇచ్చిందని అది కూడా హైదరాబాద్ నగరంలో ఇచ్చిందని, నగరంలో 29 సీట్లల్లో ఒక్కటి కూడా కాంగ్రెస్ గెలవలేదని, ఇది కేవలం కాంగ్రెస్ తప్పిదమే అన్నారు. ప్రభుత్వం ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్న అంజన్‌కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు.

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

పంజగుట్ట: 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆత్మబలిదానం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి తొలగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం బాధాకరమని ప్రభుత్వం ఆలోచించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) విజ్ఞప్తి చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా, పొట్టి శ్రీరాములు మనవరాళ్లు రేవతి, దేవకి, మునిమనవరాలు కుంద ప్రతిభలు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు అంటే ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన దేశం గర్వించదగ్గ మహా నాయకుడన్నారు. తమకు సురవరం ప్రతాప్ రెడ్డి అంటే ఎంతో గౌరవమని కొత్తగా ఏర్పాటు చెయ్యబోయే ఏదైనా యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకోవచ్చునని పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించేలా కేబినెట్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

మతసామరస్యానికి ప్రతీకగా పాతబస్తీ



ర్యాలీలో డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తదితరులు

చార్మినార్: శాంతిని కాపాడడంతో పాటు మతసామరస్యానికి ప్రతీకగా పాతబస్తీ నిలుస్తుందని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్, శారదా జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం చందూలాల్ బేలాలోని సుధా టాకీస్ నుంచి శారదా విద్యాలయం వరకు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పాల్గొన్న శారదా విద్యాలయం విద్యార్థులు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ దారి పొడవునా ప్లకార్డులను ప్రదర్శిస్తు నినాదాలు చేశారు. అనంతరం అలియాబాద్‌లోని శారదా విద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాంతిని కాపాడడంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉందన్నారు. సభలో వివిధ రంగాల్లోని నలుగురు ప్రముఖులకు గ్లోబల్ పీస్ అవార్డు-2024లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్ పీస్ ఫౌండేషన్ అధ్యక్షులు ఫారూఖ్ అలీ ఖాన్, శారదా విద్యాలయ డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ సాంబ లలిత, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, సీమ, వేణు, ఉదయ్, పాతబస్తీ టీసీసీ అధ్యక్షులు ఎస్.రామకృష్ణ శాస్త్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతలతో డాక్టర్ బండా ప్రకాష్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

గోల్కొండ: మహిళలు ఆర్థికంగా బలపడితేనే ఆ కుటుంబాలు నిలబడగలుగుతాయని ఉమ్మడి రాష్ట్ర మాజీ మహిళా కమిషన్ చైర్మన్ ఆయేషా బేగం అన్నారు. మహిళా పొదుపు సంఘాల ఏర్పాటుపై శనివారం ఆమె పీస్ ఫోర్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్‌తో సమావేశం అయ్యారు. టోలిచౌకీలోని పీస్ ఫోర్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పొదుపు సంఘాల ఏర్పాటు కోసం మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్వయం ఉపాధి కోసం ముందుకు వచ్చే మహిళలు, మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు.


ఆయేషాబేగంతో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోషామహల్ పోలీస్‌స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి వద్దు


ఎమ్మెల్యే రాజాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: గోషామహల్ పోలీస్‌స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించొద్దని స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో శనివారం ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌ను గోషామహల్ ప్రజా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆవుల వినోద్ యాదవ్, ప్రతినిధులు దత్తు, మాణిక్ లత, బెజిని శ్రీనివాస్, శైలేష్, పవన్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ..జనావాసాలలో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేష్, నేహాంక్, విష్ణు, ఈశ్వర్, చంద్రమోహన్, బద్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


షేక్ ఖైసర్

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్ ఖైసర్ (55) గత కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతూ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఈనెల 18న ఖైసర్ ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి



అబిడ్స్: కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జలవిహార్‌లో ఆయన విగ్రహానికి నవభారత్ నిర్మాణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సూరెపల్లి రవికుమార్, అఖిల భారత పద్మశాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, సంఘ సేవకులు అమృత్‌కుమార్ జైన్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన మహనీయుడు బాపూజీ అని కొనియాడారు.

భారీ వర్షం..రోడ్లు జలమయం

- నీట మునిగిన బస్తీలు
- స్తంభించిన ట్రాఫిక్
- నేలకూలిన భారీ వృక్షాలు


పురానాపూల్ గాంధీ బొమ్మ వద్ద


గోషామహల్ ఆగాపురాలో కూలిన చెట్టు


గాంధీభవన్ ముందు వరద నీరు


ధూల్‌పేటలో..


పాతబస్తీలో..


నాంపల్లిలో రోడ్ల మీద పారుతున్న వర్షపు నీరు

నాంపల్లి: భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. బస్తీల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి అందరిని ఇబ్బందులకు గురిచేసింది. దీనికితోడు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గంటల పాటు వర్షపు నీటిలోనే వాహనదారులు అవస్థలు పడ్డారు. పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. నాంపల్లి ఏరియా ఆసుపత్రి వెనుకవైపు రోడ్డుపై భారీ వృక్షం నేలకూలింది. అలాగే ఏసీగార్డ్స్‌లో ఓ వృక్షం నాలుగు చక్రాల వాహనాల మీద పడటంతో భారీగా ఆస్తినష్టం జరిగింది. అలాగే రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాలతో వాహనదారులకు తీవ్ర ఆటంకాలకు గురిచేశాయి. రోడ్లన్నీ ఏరులై పారుతుంటే జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ బృందాలు ఎక్కడా కనిపించలేదు. స్థానికులే వర్షపు నీటి కష్టాలను అధిగమించారు. మల్లేపల్లి రత్నదీప్ వద్ద తెరుచుకున్న మ్యాన్‌హోల్స్‌లో పలు వాహనాలు దిగబడిపోయాయి. వీటిని బయటకు తీసేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కనిపించని ఎమర్జెన్సీ బృందాలు..

అబిడ్స్: భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి గంటకు పైగా కురిసిన భారీ వర్షంతో రోడ్లపై పెద్ద ఎత్తున వరదనీరు నిలవడం, ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు ఇక్కట్లపాలయ్యారు. ప్రధానంగా గాంధీభవన్ ముందు కూడా మోకాళ్లలోతు వర్షం నీరు నిలిచింది. ఎంజేమార్కెట్, లక్డీకాపూల్, దారుసలాం, జాంబాగ్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు కానీ, స్థానిక పోలీసులు కానీ రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకపోవడంతో ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ బృందాలు కానీ ఎక్కడ కనిపించలేదు. ట్రాఫిక్‌లోనే గంటల పాటు ప్రజలు అవస్థలు పడుతు అవస్థలపాలయ్యారన్నారు.